తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

బుధవారం
4 నవంబర్ 2026

పేజీలు : 08

Follow :



## మైనింగ్ గుంతలో మృత్యుఘోష

### ఇద్దరి ప్రాణాలు బలి

- గొర్రెలను కడుగుదామనుకుని వెళ్లి ఒకరు మృతి.కాపాడబోయి మరో వ్యక్తి మృత్యువాత.
- భద్రతా ప్రమాణాలు ఎక్కడ.?అధికారుల పర్యవేక్షణ ఏదీ.?
- తరిగోపులలో విషాద ఛాయలు.బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

**ధారూర్, నవంబర్ 03 (జనంసాక్షి)**

మైనింగ్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు పేదల పాలిట మృత్యు కూపాలుగా మారుతున్నాయి. అధికారుల అనుమతులతో తవ్వకాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలకు భద్రత కరువైందా.?భద్రతా ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత ఎవరిది.? అధికారుల పర్యవేక్షణ ఏమైందనే ప్రశ్నలు ఇప్పుడు వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం తరిగోపుల గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటనతో తెరపైకి వచ్చాయి.గొర్రెలను కడిగేందుకు వెళ్లిన వ్యక్తి మైనింగ్ గుంతలోని బురద నీటిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోగా,అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన మరో వ్యక్తి కూడా మృత్యువాత పడ్డాడు.ఈ ఘటనలో శ్రీనివాస్ (43),అశోక్ (21) మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

లోపలి పేజీలో

### మైనింగ్ గుంతల చుట్టూ రక్షణ ఏదీ.?

మైనింగ్ తవ్వకాల అనంతరం ఏర్పడిన లోతైన గుంతల్లో వర్షపు నీరు,బురద నీరు నిల్వ ఉండటం ప్రమాదాలకు కారణమవుతోంది.గొర్రెల కాపరులు,రైతులు, పశువుల పెంపకందారులు నిత్యం ఈ ప్రాంతాల్లో సంచరిస్తుంటారు.ఇలాంటి ప్రమాదకర ప్రాంతాల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు పెట్టడం వంటి కనీస భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.అయితే తరిగోపుల ఘటన నేపథ్యంలో మైనింగ్ ప్రాంతంలో అసలు భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా.? ఉంటే ఈ ప్రమాదం ఎలా జరిగింది.?అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### - అనుమతులు ఇచ్చి వదిలేశారా.?

లావణ్య పట్టా భూముల్లో సంబంధిత అధికారుల అనుమతులతో మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.మైనింగ్ అనుమతులు ఇచ్చిన తర్వాత తవ్వకాల నిర్వహణ,భద్రతా ప్రమాణాల అమలు,తవ్వకాలు పూర్తయిన ప్రాంతాల్లో గుంతల పూడ్చివేత వంటి అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కేవలం అనుమతులు ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి భద్రతా నిబంధనలు పాటించారా.?లేదా.? నిర్లక్ష్యం ఎక్కడ జరిగింది.? అనే విషయాలను వెలుగులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### గొర్రెలను కడిగేందుకు వెళ్లి..

తరిగోపుల గ్రామానికి చెందిన శ్రీనివాస్,అశోక్ గొర్రెలను కడిగేందుకు వెళ్లిన సమయంలో మైనింగ్ తవ్వకాలతో ఏర్పడిన లోతైన గుంతలో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది.గుంతలోని బురద నీటిలో ఒకరు చిక్కుకోవడంతో అతడిని రక్షించేందుకు మరో వ్యక్తి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.రెక్కాడితే గాని డొక్కాడని గొర్రెల కాపరి కుటుంబాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబాలకు అండగా ఉన్న వ్యక్తులు దూరం కావడంతో వారి కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

### రెండు కుటుంబాలకు ప్రభుత్వ భరోసా ఏది.?

కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.మైనింగ్ నిర్వాహకుల బాధ్యతపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## నిధుల దుర్వినియోగంపై విచారణ చేయండి

- ఫిబ్రవరి 2024 నుంచి నవంబరు 2026 అవకతవకలు జరిగాయని ఆరోపణలు
- గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు డబ్బులు చెల్లించాలి
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్ రేగోండి శ్రావణ్ కుమార్

బోసిన నేజీలో

## జంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.20 కోట్లు


- దేవాదాయ శాఖ సర్వే పూర్తి.. వివరాలు వెల్లడించిన కరణం పురుషోత్తం రావు.
- రెండు విడతల్లో 13 రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు.. ఆలయానికి ఎఫ్.ఎస్. గిరి వ్యక్తిగత సహకారం



## నెత్తికి నూనె.. తప్పని సరే..!!

**తలకు మించిన భారం కాకూడదన్నట్లుగా.. ఎక్కడున్నా తలస్నానం, తలకు నూనె రాసుకోవడం మాత్రం మానరు. హైదరాబాద్ శివారులోని ఆరాంఘర్ రోడ్డు పక్కన చెట్ల నీడలో సేదతీరుతున్న సంచార జాతుల కుటుంబం కనిపించిన దృశ్యమిది. పక్కనే కుటుంబ సభ్యులు విశ్రాంతి తీసుకుంటుండగా.. ఓ మహిళ తన దైనందిన పనిలో నిమగ్నమైంది. వారి జీవనశైలికి, నిత్యజీవితపు అలవాట్లకు అద్దం పట్టే ఈ దృశ్యం ఆకట్టుకుంటోంది.**

మిద్దెల సత్యనారాయణ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనంసాక్షి)



## లా మెంటారా కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య

### ఆదిభట్ల టీసీఎస్ ఎదుట ఉద్రిక్తత..

- అర్ధరాత్రి విద్యార్థుల ఆందోళన
- హాస్టల్ గదిలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మోక్షజ్ఞ
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని తోటి విద్యార్థుల ఆగ్రహం
- కళాశాలపై దాడి, అద్దాలు-ఫర్నిచర్ ధ్వంసం
- టీసీఎస్ ప్రధాన రహదారిపై రస్తారోకో

**రంగారెడ్డి, నవంబర్ 3 (జనంసాక్షి):**

ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని లా మెంటారా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. టీసీఎస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఈ కళాశాల హాస్టల్ గదిలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రాంతానికి చెందిన మోక్షజ్ఞ (16) లా మెంటారా కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం జ్వరం రావడంతో హాస్టల్ గది నెంబర్ 320లో విశ్రాంతి

లోపలి పేజీలో



### టీసీఎస్ రోడ్డుపై రస్తారోకో..

ఘటనకు నిరసనగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు టీసీఎస్ ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై అర్ధరాత్రి బైఠాయించి రస్తారోకో నిర్వహించారు. అనుమతులు లేకుండా నడుపుతున్న ఈ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో గంటల తరబడి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు అదనపు బలగాలతో వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, విద్యార్థి ఆత్మహత్యకు గల పూర్తి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

## రేణుక ఎల్లమ్మకు వెండి ఆభరణాల ప్రధానం



**శామీర్ పేట, నవంబర్ 3 ( జనం సాక్షి )** దాత దూడల కృష్ణ గౌడ్ కుటుంబ సభ్యులు ఎల్లమ్మ అమ్మవారికి వెండి ఆభరణాలను ప్రధానం చేశారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం లోని ఎల్లమ్మ అమ్మవారికి దుడల కృష్ణ గౌడ్ వారి కుటుంబ సభ్యులు గ్రామం నుంచి కేరళ వాయిద్యాలతో ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే గుల్యాగారి నర్సింగ్ రావు గౌడ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి ఆభరణాలను ప్రధానం చేశారు.

## కౌకూర్‌లో కమ్యూనిటీహాల్‌కు స్థల పరిశీలన



**అల్వాల్, నవంబరు 3 (జనంసాక్షి):** మల్కాజిగిరి నియోజకవర్గం కౌకూర్ కింది బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంగళవారం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది .సూపరింటెండింగ్ ఇంజినీర్ లక్ష్మణ్, డీఈ పద్మలత, ఏఈ సత్యలక్ష్మి స్థలాన్ని పరిశీలించి స్థానికులతో నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. మహిళా సాధికారత కార్యక్రమాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్థానిక సమావేశాలు, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈ కమ్యూనిటీ హాల్ ఉపయోగపడేలా నిర్మించాలని ప్రతిపాదించినట్లు మల్లికార్జున్ తెలిపారు. నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలు త్వరితగతిన చేపట్టాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు, మహిళలు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో విషాదం

### బక్కయ్య గౌడ్ కుటుంబానికి అండగా నిలిచిన బీఎస్ఆర్



**తాండూరు నవంబర్ 3(జనంసాక్షి)**మల్కాపూర్ గ్రామానికి చెందిన కే.శే. కలాల్ బక్కయ్య గౌడ్ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.విషయం తెలుసుకున్న వెంటనే ఆర్బీ వోఎల్ సీఈఓ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (బీఎస్ఆర్) వారి అంత్యక్రియలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా బీఎస్ఆర్ మాట్లాడుతూ కే.శే. బక్కయ్య గౌడ్ మృతి ఎంతో బాధాకరం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు.అనంతరం ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ కష్టకాలంలో మీకు అండగా నేను ఉంటాను. ధైర్యంగా ఉండండని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## విద్యార్థులకు అగ్నిమాపక భద్రతపై అవగాహన



**కొడంగల్, నవంబర్ 3 (జనం సాక్షి):** నవీన ఆదర్శ ప్లే అండ్ హైస్కూల్‌లో దీపావళి పండుగను పురస్కరించుకొని అగ్నిప్రమాదాల నివారణ, అగ్నిమాపక భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొడంగల్ అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ విద్యార్థులకు బాణసంచా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై వివరించారు.

## పాఠశాల పరిసరాల పరిశుభ్రత పట్టించుకోని మున్సిపల్ పాలక వర్గం, అధికారులు

### అలియాబాద్ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్



**శామీర్ పేట్, అక్టోబర్ 3(జనం సాక్షి )** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు, దట్టమైన పొదలు పెరిగిపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయందోళనకు గురయ్యారు. ఇప్పటికే పాఠశాల పరిసరాల్లోకి పాములు వస్తుండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు చదువుకునే ప్రదేశంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం తల్లిదండ్రుల్లోనూ ఆందోళనను గుర్తించి మూడు నెలలుగా అలియాబాద్ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్ సమావేశాల్లో విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేయించాలని, పాముల బెడద నుంచి విద్యార్థ లకు రక్షణ కల్పించాలని గత మూడు నెలలుగా మున్సిపల్ బాడీ సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావించినట్లు తెలిపారు. పాఠశాలలోకి పాములు వస్తున్నాయని, ఎప్పుడైనా విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, కమిషనర్ వెంకటరెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి నప్పటికీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఇంతటి కీలకమైన సమస్య మూడు నెలలుగా పట్టించుకోక పోవడం మున్సిపల్ యంత్రాంగం పనితీరు ఏలా ఉందో అర్థం అవుతుందని అన్నారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత చైర్మన్ కు, కమీషనర్ కు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారంలో విఫల మాయ్యారని ఆరో పించారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా సొంత ఖర్చులతో పనులు చేశానని తెలిపారు. మున్సిపల్ అధికారుల నుంచి స్పందన లేక పోవడంతో తానే స్వయంగా ముందుకొచ్చానని పేర్కొన్నారు.విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టు కొని తన సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించినట్లు తెలిపారు.ప్రభుత్వ యంత్రాంగం చేయాల్సిన పనిని కౌన్సిలర్ తన సొంత ఖర్చులతో చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలనే ఉద్దేశంతో ఈ పనులు చేసినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఒంటెద్దు పోకడలు పోకుండా అందరిని కలుపుకొని సమన్వయంతో పనిచేస్తేనే ఇలాంటి సమస్యలకు సకాలంలో పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం తగదు

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య




**ముషీరాబాద్, నవంబర్ 03 ( జనం సాక్షి):**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా, 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జే) సభ్యులకు న్యాయం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. పేట్ బషీరాబాద్, నిజాంపేట్ ప్రాంతాల్లో గతంలో కేటాయించిన స్థలాలను సొసైటీ సభ్యులకు అప్పగించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం సొసైటీ సభ్యులు రమణారావు అధ్యక్షతనజేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. దాదాపు 18 ఏళ్ల క్రితం జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి పేట్ బషీరాబాద్, నిజాంపేట్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు సభ్యులకు అందించకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లించి ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, వారి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిజాంపేట్‌లోని సర్వే నంబర్ 332లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్‌లోని సర్వే నంబర్ 25/2లో 38 ఎకరాల భూమిని సొసైటీకి కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే, ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవడం జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం పలుమార్లు ఈ విషయంపై హామీలు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఆ హామీల అమలులో పురోగతి లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసి, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరారు. జేఎన్‌జే సొసైటీ సభ్యులకు గతంలో కేటాయించిన పేట్ బషీరాబాద్, నిజాంపేట్ భూములనే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న సభ్యులు తమకు గతంలో కేటాయించిన రెండు ప్రాంతాల్లోని స్థలాలనే కేటాయించాలని తీర్మానం చేశారు. 18 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించి జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, టీఆర్ఎస్ మీడియా విభాగం అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, జేఎన్‌జే సొసైటీ నాయకులు అశోక్ రెడ్డి, శ్రీనివాసరావు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఎం. రవికుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## మధుయాష్కి గౌడ్ ప్రత్యేక చొరవతో వరద ముంపు సమస్యకు పరిష్కారం

### పైపులైన్ నిర్మాణానికి రూ. 5.95 కోట్ల నిధులు మంజూరు



**హయత్‌నగర్, నవంబర్ 3 (జనం సాక్షి)**సాహెబ్ నగర్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్య పరిష్కారానికి కీలక ముందడుగు పడిందని సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేతావత్ రమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ప్రత్యేక చొరవతో బి.ఎన్.రెడ్డి నగర్‌లోని కాప్రాయి చెరువు నుంచి హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట వరకు వరద నీటి పైపులైన్ నిర్మాణానికి రూ. 5.95 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కాప్రాయి చెరువును సందర్శించిన మధుయాష్కి గౌడ్‌ను స్థానిక కాలనీల ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న వరద ముంపు సమస్యలను వివరించారని తెలిపారు. ప్రతి వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన మధుయాష్కి గౌడ్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారని వివరించారు. ఆయన ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.హరిహరపురం, బి.ఎన్.రెడ్డి నగర్, శ్రీపురం కాలనీ, గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, రంగారెడ్డి కాలనీ, అఖిలాండేశ్వరి నగర్, స్నేహమయి నగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతి నగర్, బ్యాంక్ కాలనీ, మైల్‌స్టోన్ తదితర కాలనీలతో పాటు గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాలు ప్రతి వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ప్రతిపాదిత పైపులైన్ నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుని నిధుల మంజూరుకు కృషి చేసిన మధుయాష్కి గౌడ్‌కు సాహెబ్ నగర్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ల ప్రజల తరఫున కేతావత్ రమేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ చైర్మన్ భవాని సరస్వతి, సీనియర్ నాయకులు చంద్రకాంత్ గౌడ్, పాటి రాంబాబు గౌడ్, శంకర్ నాయక్, పారంద స్వామి, చిత్తరంజన్, రామకోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణం వేడుకలు

### కళ్యాణంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, భక్తులు



**శామీర్ పేట, నవంబర్ 3 (జనం సాక్షి )**శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ 9వ వార్షికోత్సవం లో భాగంగా అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా దూడల కుటుంబ సభ్యులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం లందలో పూజలు జరిపి అమ్మవారికి ఘటం తీసుకు వెళ్లారు. అనంతరం భక్తుల కోలాహలం, వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణ ల మధ్య అమ్మ వారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి సూర్య బోనం సమర్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భం గా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ శిరీష కృష్ణారెడ్డి, శామీర్ పేట తహసిల్దార్ శ్రీనివాస్, శామీర్ పేట ఇన్స్పెక్టర్ నరసింహారెడ్డి, ఎస్ ఐలు శశివర్ధన్ రెడ్డి, రంజిత్ నాయక్, అల్వాల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జానకి రాములు, ట్రాఫిక్ ఎస్ ఐ రాజ శేఖర్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ జశ్వంత్ రెడ్డి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి, కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు, శామీర్ పేట గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు సుదర్శన్, డప్పు సాయిబాబు , షెడ్డు ధాత మిరియాల ప్రవీణ్ రావు, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీల కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, వివిధ గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేసి ఎల్లమ్మ అమ్మవారును అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం.కాగా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 9వ వార్షికోత్సవం సందర్భంగా దూడల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ఎల్లమ్మ ఆలయానికి విచ్చేసిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# బాధిత కుటుంబాలకు అండగా..బిఆర్ఆర్ ఫౌండేషన్



**రంగారెడ్డి, నవంబర్ 3 (జనంసాక్షి):** ఆపదలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేసి బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. నాగన్పల్లి గ్రామానికి చెందిన మేడిబాయ్ రజితను యాచారం మండలం చింతుల గ్రామానికి చెందిన సంజీవకు ఇచ్చి వివాహం జరిపించారు. వృత్తిరీత్యా లేబర్ పనిచేసే సంజీవ.. పనిలో భాగంగా సిమెంట్ బస్తా మోస్తూ భవనం మెట్లు ఎక్కుతుండగా అకస్మాత్తుగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోమాలోకి వెళ్లిన ఆయన 15 రోజుల తర్వాత మృతి చెందాడు. అదే సమయంలో ఆయన భార్య రజిత కోటి ఆసుపత్రిలో మూడో బిడ్డకు జన్మనిచ్చింది. భర్త మరణవార్త తెలియడంతో డెలివరీ అయిన రెండు రోజులకే ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. రజితకు తల్లి లేకపోవడం, తండ్రి మైసయ్య వృద్ధుడు కావడం, కుటుంబంలో సంపాదించే దిక్కు లేకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర దిక్కుతోచని స్థితిలో పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి తక్షణమే స్పందించి, తన వంతు సహాయంగా రూ.10,000 ఆర్థిక సాయాన్ని బాధితులకు అందజేశారు.అదే విధంగా రాయపోల్ గ్రామంలో డ్వాక్రా మహిళల కోసం 50 కుర్చీలు, ముకునూర్ గ్రామానికి 30 కుర్చీలు, పోల్కంపల్లిలోని లైబ్రరీకి 30 కుర్చీలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ మమతా శ్రీశైలం, ముకునూర్ సర్పంచ్ శిల్పా ప్రేమ్ కుమార్, వార్డు సభ్యులు, బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు చెరుకూరి రవీందర్, ములుగు సంజీవ తదితరులు పాల్గొన్నారు. తమ అవసరార్థం కుర్చీలు అందజేసిన ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డికి మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నిరుద్యోగ సమస్య పరిష్కారానికి యువత పోరాటాలకు సిద్ధం కావాలి



### డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపు

**ముషీరాబాద్, నవంబర్ 03 ( జనం సాక్షి):**నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం, యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యువత ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, జిల్లా కార్యదర్శి జావీద్ మాట్లాడుతూ.. 1980 నవంబర్ 3న పంజాబ్లోని లూధియానాలో డీవైఎఫ్ఐ ఆవిర్భవించిందని తెలిపారు. నాటి నుంచి విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, నిరుద్యోగ నిర్మూలన, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల సాధన కోసం సంఘం నిరంతరం పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో నిరుద్యోగం తీవ్ర సమస్యగా మారిందని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, యువతకు తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యువతను మత్తు పదార్థాలు, సామాజిక దురాచారాలకు దూరంగా ఉంచి, ప్రజా సమస్యలపై చైతన్యవంతులను చేయడమే డీవైఎఫ్ఐ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.యువతకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. భగత్సింగ్ స్ఫూర్తితో యువతీ యువకులు ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజా సమస్యలపై జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని, పెద్ద సంఖ్యలో డీవైఎఫ్ఐలో చేరి యువజన ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో అవినీతిని అంతం చేసేందుకు యువత నడుం బిగించాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు అవినీతిలో కూరుకుపోతున్నారని విమర్శిస్తూ, అవినీతికి వ్యతిరేకంగా యువత చైతన్యవంతమై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దేవేందర్, రాజయ్య, మణిరాజ్, పంచాక్షర్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే వినతి



**అల్వాల్, నవంబరు 3 (జనంసాక్షి):** నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు, కొత్త పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి కోరారు. మంగళవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో జెడ్సీ సంచిత్తో సమావేశమైన ఆయన పలు అభివృద్ధి, మౌలిక వసతుల సమస్యలను ప్రస్తావించారు.అల్వాల్ చిన్నరాయుని చెరువు సుందరీకరణ, ఫైర్స్టేషన్ ఏర్పాటు, హైటెన్షన్ రోడ్డు విస్తరణ, ఆర్కే పురం ఫ్లైఓవర్ పనుల పురోగతిపై చర్చించారు. ఆయా పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జెడ్సీకి విజ్ఞప్తి చేశారు. కొత్త అభివృద్ధి పనులకు నిధుల మంజూరుపైనా చర్చించారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్రెడ్డి, అనిల్ కిషోర్, జగదీశ్ గౌడ్, పరశురాం రెడ్డి, అమీన్, చిన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో విద్యుత్ శాఖ అరాచకం

### బిల్లు కట్టిన వినాయక ఆసుపత్రికి రూ. 5 లక్షల జరిమానా

### మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్



**తాండూరు నవంబర్ 3(జనంసాక్షి)**తాండూరు పట్టణంలోని వినాయక ఆసు పత్రికి విద్యుత్ శాఖ అధికారులు రూ. 5 లక్షల భారీ జరిమానా విధించడం కలకలం రేపుతోంది. బిల్లు సకాలంలో చెల్లించినా ఫైన్ వేయడంపై ఆసుపత్రి యాజమాన్యం, ప్రజలు మండిపడుతున్నారు.ఈ విషయంపై మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్ స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లు చెల్లించినా రూ. 5 లక్షల ఫైన్ వేయడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆసుపత్రులు వంటి అత్యవసర విభాగాలకు విద్యుత్ నిలిపివేతకు ముందు తప్పనిసరిగా ముందస్తు సమాచారం ఇవ్వాలి. అయినా విద్యుత్ అధికారులు ఆ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఆసుపత్రికి ఇలా భారీ జరిమానా విధించడం సరికాదు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ అక్రమ ఫైన్ను రద్దు చేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విఠల్ నాయక్ డిమాండ్ చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటర్ నమోదు చేసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**మర్పల్లి నవంబర్ 03 (జనంసాక్షి)** ఎమ్మెల్సీ పట్టబద్దుల ఓటర్ నమోదు ప్రక్రియ మరో మూడు రోజుల గడువు ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పార్టీ నాయకులకు సూచించారు. మంగళవారం మర్పల్లి మండల పరిధిలోని పట్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ నమోదు సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరణతో పాటు పట్టబదుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు పురోగతిపై చర్చించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్ నమోదును వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మధుకర్, రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, తుమ్మలపల్లి సర్పంచ్ కర్నే రాజు, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మాజీ యూత్ ప్రెసిడెంట్ మధుకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐపీఎస్ఓ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకన్న ఏకగ్రీవ ఎన్నిక



**అబ్దుల్లాపూర్‌మెట్ ,నవంబర్ 03(జనం సాక్షి):** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యద ర్శిగా పల్లె వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శి బాధ్యతలను పల్లె వెంకన్నకు అప్పగించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి పల్లె వెంకన్న మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పడం, యుద్ధాలు లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధ భయంతో అల్లాడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతా భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజల చైతన్యం ముందు నియంతృత్వ, యుద్ధోన్మాద శక్తులు నిలవలేవని చరిత్ర నిరూపిస్తోందన్నారు. రంగారెడ్డి జిల్లాలో శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరినీ సంఘంలో భాగస్వాములను చేస్తూ, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పల్లె వెంకన్న తెలిపారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి నవంబర్ 3 (జనం సాక్షి)**ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని వెస్ట్ కాకతీయ నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వెస్ట్ కాకతీయ నగర్‌లో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ సత్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, రాజ్యలక్ష్మి, నాయకులు బద్ధం పరశురాంరెడ్డి, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, శివ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రావు, బాలకృష్ణ, భాగ్యానంద్, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులు తిప్పారెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరల పెరుగుదలపై బీఆర్ఎస్ మహిళా విభాగం మౌన ప్రదర్శన

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ఎల్బీనగర్ నవంబర్ 3 (జనం సాక్షి):** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఎల్బీనగర్ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ నుంచి ఎల్బీనగర్ చౌరస్తా వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న ధరలు, 2026లో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెరిగిన ధరలను పోలుస్తూ రూపొందించిన పట్టికను మహిళా నాయకులు ప్రదర్శించారు. బియ్యం, వంటనూనె, గ్యాస్, పాలు, పప్పులు తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు ధరలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాల్ పశువుల సంత అభివృద్ధికి ఆర్డిఓ సానుకూల స్పందన



**యాచారం,నవంబర్ 3 (జనం సాక్షి )** యాచారం మండలం మాల్ గ్రామాభి .వృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, దుష్ప్రచారాలను పట్టించుకోకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని మాల్ సర్పంచ్ బెల్లి అశోక్ స్పష్టం చేశారు. మంగళవారం సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, యాచారం తాసిల్దార్ అయ్యప్పలను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మాల్ గ్రామపంచాయతీకి ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న పశువుల సంత ద్వారా ఏటా సుమారు కోటి రూపాయల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. సంతలోని గుంతల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు మట్టి పోసి చదును చేసేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరగా, ఆర్డీవో సానుకూలంగా స్పందించి తహసీల్దార్ తగిన సూచనలు చేశారన్నారు. నిబంధనల ప్రకారం సంత అభివృద్ధికి మట్టి వేయడంలో తప్పులేదని తెలిపారని, అయితే కొందరు సోషల్ మీడియాలో 'మట్టి మాఫియా' అంటూ అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. అలాగే మాల్, మాల్ మార్కెట్, కిషన్‌పల్లి పరిధిలో రేషన్ కార్డులు ఎక్కువగా ఉన్నందున ప్రజల సౌకర్యార్థం అదనంగా మరో రేషన్ షాపు మంజూరు చేయాలని కోరగా ఆర్డిఓ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఆర్డీవో కు అటెస్ట్ చేసిన ప్రతులను యాచారం సీఐకి అందజేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా, అవసరమైతే సొంత నిధులు వెచ్చించి అయినా మాల్ అభివృద్ధికి 24 గంటలూ అందుబాటులో ఉంటానని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామలింగం, బట్టు ప్రియాంక లింగం, మాజీ సర్పంచ్ చిన్నోళ్ల జహంగీర్ పద్మజ, నాయకులు సోప్పరి శ్రీనివాస్, ఈశ్వర్, యాదయ్య, గలయ్య, మురళి, శివ, రాము, సాయి, గణేష్, జి పి ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి చింపుల సత్యనారాయణ రెడ్డి నిరాకరణ

### రెండేళ్ల రాజకీయ లక్ష్యాలే ప్రాధాన్యం



**చేవెళ్ల, నవంబర్ 03 (జనంసాక్షి)** తనపై నమ్మకంతో అడగకుండానే చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి అవకాశం కల్పించాలని భావించిన ఎమ్మెల్యే కాలే యాదయ్యకు చింపుల సత్యనారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే చేవెళ్ల ఎమ్మెల్యేగా లేదా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం రాబోయే రెండేళ్లు రాజకీయంగా పూర్తిస్థాయిలో సమయం కేటాయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి తగిన సమయం కేటాయించి న్యాయం చేయలేనని, డైరెక్టర్ల జాబితా నుంచి తన పేరును తొలగించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. 2006లో దేవుని ఎర్రవల్లి గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన తాను, రంగారెడ్డి జిల్లా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘాల అధ్యక్షుడిగా, చేవెళ్ల జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశానని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడిగా స్థానిక సంస్థల హక్కుల కోసం పోరాడుతున్నానని పేర్కొన్నారు. 2017లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరి పలు బాధ్యతలు నిర్వహించానని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా కొనసాగుతున్నానని వివరించారు. ఇటీవల డీసీసీబీ చైర్మన్ పదవికి అవకాశం దక్కకపోయినా, తన భవిష్యత్ రాజకీయ లక్ష్యాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిలతో గతంలో చర్చించగా సానుకూల స్పందన లభించిందని వెల్లడించారు. ఈ లక్ష్యాల సాధన కోసం సమయం కేటాయించాల్సి ఉన్నందున పీఏసీఎస్ డైరెక్టర్ పదవిని స్వీకరించలేనని స్పష్టం చేశారు. తనకు అవకాశం కల్పించాలని భావించిన ఎమ్మెల్యే కాలే యాదయ్యకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

### రూ.18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



**చేవెళ్ల, నవంబర్ 03 (జనంసాక్షి)** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. ఈ మేరకు ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలేనని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్, అంటువ్యాధుల నివారణ, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. ఆశా వర్కర్ల శ్రమకు తగిన గుర్తింపు, వేతనాలు, సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా కార్యకర్తలు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారని తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి కమిషనర్ కార్యాలయం వద్ద కూడా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి మరో మార్గం లేకపోవడంతో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

### కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి.. ఈ నెల 15 నుంచి సమ్మెకు సిద్ధం



**అబ్దుల్లాపూర్‌మెట్ ,నవంబర్ 03(జనం సాక్షి):**ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో డాక్టర్ ప్రియాంకకు సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు కలిసి సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఇ. నర్సింహ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆశ వర్కర్లకు న్యాయమైన వేతనాలు, కనీస ఉద్యోగ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ నెల 15వ తేదీ నుంచి ఆశ వర్కర్లు సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. సమ్మెకు ముందే ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు జరిపి, ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, గుండె శివకుమార్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల పట్ల విరుచుకుపడ్డ టౌన్ ప్లానింగ్ అధికారులు

### అక్రమ కట్టడాలకు మాత్రం అన్ని తామే అంటున్న టౌన్ ప్లానింగ్ టిపిఎస్



**జనం సాక్షి నాచారం** : నిరుపేదలకు ఒక న్యాయం, డబ్బులు ఉన్నోడికి, రాజకీయ పలుకుబడి ఉన్నోడికి ఒక న్యాయం చేస్తున్న కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు. మంగళ వారం రోజున మల్లాపూర్ డివిజన్ నుండి, మొదలు కొని, నాచారం, హెచ్ఎంటి, మల్లాపూర్ డివిజన్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు దారుణానికి పాల్పడ్డారు అని చెప్పుకోవచ్చు. గత 6 నెలల నుండి నాచారం, హెచ్ ఎమ్ టి, మల్లాపూర్ డివిజన్ లో ఎలాంటి అనుమతులు లేకుండా,స్థానిక మాజీ కార్పొరేటర్ల అండదండలతో బహులాంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న కనీసం వాటి వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం విడ్డూరం. ప్రభుత్వ ఉద్యోగులు గా ఉండి,ప్రభుత్వానికే గండి కొడుతుంటే, ఇక న్యాయం ఎలా జరుగును, అభివృధి ఎలా జరుగుతుంది అని మండిపడుతున్నారు.అక్రమాలకు అండగా నిలిచి,రోడ్డు కి ఇరువైపుల నిరాశ్రయులపైన విశ్వ రూపం చూపిన టౌన్ ప్లానింగ్ అధికారులు..సమాజం లో ప్రజల పట్ల బాధ్యతా యుతంగా ప్రవర్తించే వారే అక్రమాలకి పాల్పడితే వ్యవస్థ నాశనం అవ్వడం పక్కా. మంగళవారం రోజున మల్లాపూర్ డివిజన్ లోని ఎలిఫెంట్ సర్కిల్ నుండి మొదలు కొని మల్లాపూర్ జనప్రియ వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల, నిరాశ్రయుల పట్ల టౌన్ ప్లానింగ్ అధికారులు కర్కశంగా వ్యవహరించిన తీరుకు స్థానికులు మండిపడ్డారు..రోడ్డు పైన నడవడం కోస ఇబ్బందులు పడే బాటసారుల కోసం ఫుట్ పాత్,కబ్జాలు అరికట్టడం మంచిదే. కానీ హుటాహుటిన, చెప్పుచేయకుండా,రోడ్డు పైన జీవనం సాగించే వారిపైన అధికారుల జులుం చూపడం ఎంత వరకు సమంజసం అని వాపోయారు.అధికారులకు బహుళ అంతస్తుల భవనాల పట్ల పదుల సార్లు ఫిర్యాదు చేసిన పట్టింపులేదు.అనుమతి లేని అక్రమ కట్టడాల విషయం లో అధికారులే అక్రమాలకి అండగా నిలిస్తే ఎలా అని మండిపడుతున్నారు.నిరుపేదల పట్ల సవతి తల్లి ప్రేమను చూపి, అవినీతికి మాత్రం కాసులకి కక్కుర్తి పడి దారుణాలకి పాల్పడుతున్న తీరును అధికారులు మార్చుకుంటే వ్యవస్థ బాగుపడుతుంది అని సామాజిక కార్యకర్తలు వాపోయారు.టౌన్ ప్లానింగ్ ఏసీపి నుండి మొదలు కొని టిపిఎస్ ,చైన్ మెన్ వరకు మొత్తం కూడా అక్రమ కట్టడాల వద్ద అంతస్తుకు ఒక ధర మాట్లాడుకొని అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న తీరును మార్చుకొని అందరికీ ఒకే న్యాయం అనే విధంగా పని చేస్తారో లేక అవినీతి అధికారులుగా నే ఉండి ముడుపులకు ఆశ పడి రాజ్యమేలుతారో చూడాల్సిందే.

# ఇంద్రన్న కాలనీలో ఇందిరమ్మ మహిళా భవనం నిర్మించాలి

### సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



**కుత్బుల్లాపూర్ నవంబర్ 3( జనం సాక్షి)**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి మండలం, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ఇంద్రన్న కాలనీలో కాలనీ వాసుల ప్రజా ప్రయోజనాల అవసరానికి ఇందిరమ్మ మహిళా భవన్ కమిటీ హాల్ కావాలని మంగళవారం బాచుపల్లి మండల కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల కాలంగా స్థానిక ప్రజలతో ఇంద్రన్న కాలనీ కల్చరల్ ఆ వెల్ఫేర్ అసోసియేషన్ తో కలిసి ఆ కాలనీ వాసిగా, కాలనీ అధ్యక్షునిగా అనేక సార్లు కలెక్టర్ కి, ఆర్డీఓ కి, మండల తహసీల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. వాణి రెడ్డి బాచుపల్లి మండల తహసీల్దార్ గా వచ్చిన తరువాత కలెక్టర్ సర్వే చేయమని ఆర్డర్ పంపారు. తహసీల్దార్ అప్పుడు సర్వేయర్ గా ఉన్న సింధు కి సర్వే చేయమని మెమో ఇచ్చారు. సింధు కాలయాపన చేసింది కానీ ఇప్పటి వరకు సర్వే చేయలేదు.అని అన్నారు. ఆలాగే కొంత ఓటు నమోదు కార్యక్రమం వల్ల ఆలస్యం అయింది అని గుర్తు చేశారు. కనుక ఇప్పుడైనా ఇందిరమ్మ మహిళా భవన్ నిర్మాణం చేసే విధంగా సర్వే చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి, నర్సింహా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఏఈఈ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే చేరుకోవాలి



**హైదరాబాద్ సిటీ, నవంబర్ 03 (జనం సాక్షి) :** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్(ఏఈఈ) పోస్టుల నియామక పరీక్షలను ఎలాంటి ఇబ్బందు లు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మంగళవా రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్(సివిల్) పోస్టుల భర్తీకి నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్ష(సీబీఆర్టీ) ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నవంబర్ 6, 7 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 640 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కంప్యూటర్ల పనితీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ రామ్‌దాస్ తేజావత్, డాక్టర్ ప్రసిధ్, ఏఈఈ/టీ ఎస్.నందన్, వైద్యారోగ్య శాఖకు చెందిన డాక్టర్ శ్రీలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకురాలు కంజర్ల విజయలక్ష్మిపై ఆరోపణలు తగవు

### సేవకే అధిక ప్రాధాన్యత, రాజకీయ లబ్ధి కోసం కాదు



**తాండూరు నవంబర్ 3(జనంసాక్షి)**ప్రజా సేవకురాలు కంజర్ల విజయలక్ష్మిపై వస్తున్న ఆరోపణలు సరికావని, ఆమె ప్రజా సేవలో ముందడుగు వేస్తున్నారని స్థానిక నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ “విజయలక్ష్మి గత కొంతకాలంగా నాలుగు మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా మహిళా సాధికారతతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఇలాంటి మహిళా నాయకురాలిపై కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఇది సరికాదని వారు ఖండించారు.నిస్వార్థంగా సేవ చేస్తున్న విజయలక్ష్మికి ప్రజల్లో రోజురోజుకీ ఆదరణ పెరుగుతుండటం చూసి ఓర్వలేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వారు పేర్కొన్నారు..

## ఊరెళ్ల గ్రామకంఠం భూములకు సర్వే నిర్వహించాలి ఆర్డీవో, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత



**చేవెళ్ల, నవంబర్ 03 (జనంసాక్షి):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరెళ్ల గ్రామకంఠం భూములకు సర్వే నిర్వహించాలని కోరుతూ మంగళవారం ఆర్డీవో కె.పార్థసింహారెడ్డి, తహశీల్దార్ కృష్ణయ్యకు గ్రామస్థుల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఊరెళ్ల వార్డుల కౌన్సిలర్లు దూత మల్లేష్, డప్పు సువర్ణ చందు, మాజీ సర్పంచులు శెట్టి రమేష్, అరుణ నర్సింలు ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం సమర్పించారు. గ్రామకంఠం భూముల హద్దులు, వివరాలను గుర్తించేందుకు అధికారులు త్వరితగతిన సర్వే నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సునిగంటి విట్టలయ్య, తిమ్మారెడ్డిగూడెం రాజు, ఉబ్బటి బీరప్ప, గూడెపు ప్రవీణ్, మహమ్మద్ జావిద్, గారెల కర్ణాకర్ గౌడ్, మహమ్మద్ జాగిర్, మహమ్మద్ సాజిద్, మహమ్మద్ ఆసిఫ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకే నిధులు లేవా.. ఇక ప్రజల పరిస్థితి ఏంటి

### కాంగ్రెస్ ప్రభుత్వంపై మన్నె గోవర్ధన్ రెడ్డి విమర్శలు



**ఖైరతాబాద్, నవంబర్ 03 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అధికార పార్టీ ఎమ్మెల్యే లకే నిధులు అందక, అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొందని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేలకే దిక్కులేని పరిస్థితి ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన క్యాంపు కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆ పార్టీ నాయకులు ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం పాలనలోని వైఫల్యాలకు నిదర్శనమని అన్నారు. రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేస్తానని ప్రకటించే పరిస్థితి రావడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం, నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోవడం కాంగ్రెస్ పాలనలో సాధారణంగా మారిందని ఆరోపించారు. ఎమ్మెల్యేలకే నిధులు కేటాయించలేని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ప్రజలకు కనిపించే అభివృద్ధి ఎక్కడా లేదని విమర్శించారు. ఒకవైపు రైతులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలతో పాటు సొంత పార్టీ ఎమ్మెల్యేల కూ న్యాయం జరగడం లేదని, ప్రభుత్వ వైఫల్యాలు రోజురోజుకూ బయటపడుతున్నాయని మన్నె గోవర్ధన్ రెడ్డి విమర్శించారు.

## రోడ్డుపై నిర్మాణ సామగ్రి.. శాంతినగర్ వాసులకు తప్పని తిప్పలు

### సోమాజిగూడ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నేత మహేష్ యాదవ్



**ఖైరతాబాద్, నవంబర్ 03 (జనం సాక్షి) :** సోమాజిగూడ డివిజన్ శాంతి నగర్‌లో భవన నిర్మాణ పనుల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని సోమాజిగూడ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేష్ యాదవ్ తెలిపారు. ఈ సమస్యపై ఆయన ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. శాంతినగర్‌లోని ఇంటి నంబర్ 6-3-841/జి/ఏవద్ద చేపడుతున్న భవన నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మాణ సామగ్రిని రోడ్డుపై నిల్వ ఉంచుతున్నారని, క్యూరింగ్ నీరు వీధుల్లోకి ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బం దులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివల్ల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో అసౌకర్యం నెలకొందని తెలిపారు. ఈ విషయంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ నిర్మాణ పర్యవేక్షకుడు పట్టించుకోకుండా దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించాలని, నిర్మాణ యజమానుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని మహేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి

# నిధుల దుర్వినియోగంపై విచారణ చేయండి

**పెద్దేముల్ నవంబర్ 03 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మంబాపూర్ గ్రామపంచాయతీలో అవకతవకలు జరిగాయని మాజీ సర్పంచ్ రేగోండి శ్రావణ్ కుమార్ ఆరోపించారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ప్రకారం.. రాష్ట్ర పంచాయితీ రాజ్ కమిషనర్ 19.02.2026వ తేదీన ఇచ్చిన సీపీఆర్ఆర్ఈ- జీ1/ఎస్సీహెచ్ఎం/ఎక్స్‌వీఎఫ్‌సీ/2/జీ సెక్షన్ సర్యూలర్ ప్రకారం మాజీ సర్పంచులు చేసిన పనులకు వెంటనే డబ్బులు చెల్లించాలని ఉత్తర్వులున్నప్పటికీ, తాను చేసిన పనులకు డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి వచ్చిన సర్కులర్‌ను పక్కనపెట్టి, ప్రస్తుత సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా నిధులను ఇతరత్రా పనులకు వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదిలా ఉంటే, గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న ఆయంలో చేసిన పనులకు ఎంబీ రికార్డులు చేసి సంబంధిత అధికారులకు ఇచ్చినకూడా, తాను చేసిన పనులకు ఎంబీ రికార్డుల ప్రకారం నాకు డబ్బులు ఇవ్వకుండా కక్షపూరిత ధోరణితో ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా, ప్రత్యేక అధికారుల పాలన కాలంలో గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సంజీవ్ కుమార్ గ్రామంలో ఎటువంటి పనులు చేయకుండానే మంబాపూర్ గ్రామపంచాయతీ సంబంధించిన ఎంబీలో రికార్డు చేయకుండా, దుగ్గాపూర్ గ్రామపంచాయతీ సంబంధించిన ఎంబీలో రికార్డు చేయించి అక్రమంగా డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సంజీవ్ కుమార్ మంబాపూర్ నుంచి బదిలీ కావడంతో మరో కార్యదర్శికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారని, అయితే, సంజీవ్ కుమార్ బదిలీ జరిగి నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ ప్రస్తుత పంచాయతీ కార్యదర్శికి చార్జి ఇవ్వలేదని, చార్జి ఇవ్వకుండానే ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో చెప్పుకొచ్చారు. ప్రస్తుత సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు పంచాయతీ ఇష్టానుసారంగా నిధులను ఖర్చు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కావున ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రామపంచాయతీలో జరిగిన పనులపై సమగ్ర విచారణ జరిపి, పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని, తాను చేసిన పనులకు రావాల్సిన డబ్బులను ఇప్పించేందుకు కృషి చేయాలని మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## జంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.20 కోట్లు

**యాలాల నవంబర్ 03 ( జనంసాక్షి ) :** యాలాల మండల పరిధిలోని చారిత్రక ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి మార్గం సుగమమవుతోంది. ఆలయ సమగ్ర అభివృద్ధి నిమిత్తం ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా రూ.20 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, సాంకేతిక విభాగం ప్రతినిధులు ఆలయ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఈ విషయాలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ రాష్ట్ర సమన్వయకర్త, తాండూరు నియోజకవర్గ ఎస్ఐఆర్ కన్వీనర్, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తం రావు, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు జె. రాఘవేందర్ రావు సంయుక్తంగా వివరాలు వెల్లడించారు.

**రెండు విడతల్లో 13 రకాల అభివృద్ధి పనులు :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు చర్యలు చేపట్టినట్లు కరణం పురుషోత్తం రావు తెలిపారు. మొత్తం రూ.20 కోట్ల అంచనా వ్యయంతో 13 రకాల పనులను రెండు విడతలుగా చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. మొదటి విడతలో రూ. 10 కోట్లు, రెండో విడతలో రూ.10 కోట్లతో పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

**క్షేత్రస్థాయి సర్వే పూర్తి.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు :**

ఆలయ పునర్నిర్మాణ నమూనా, నిర్మాణ అంచనాల తయారీ కోసం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ పరిసరాలను పరిశీలించి భూముల కొలతలు తీసుకొని సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వే నివేదిక ఆధారంగా సమగ్ర ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించి నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు కరణం పురుషోత్తం రావు వెల్లడించారు. ఆలయ పునర్నిర్మాణం పూర్తయితే భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు పుణ్యక్షేత్రం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆలయ అభివృద్ధికి ఎఫ్. ఎస్. గిరి ప్రత్యేక సహకారం :**

జంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పట్ల స్థానిక ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఎఫ్. ఎస్. గిరి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతుగా వ్యక్తిగత సహకారంతో పాటు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు ప్రత్యేకంగా వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారం కూడా అందితే ఆలయ అభివృద్ధి పనులు మరింత సమర్ధవంతంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన జంటుపల్లి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం కావడంపై స్థానిక భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్షేత్రస్థాయి సర్వే, పరిశీలన కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ సిబ్బంది , ఈవో నాయక్, ఇంజనీరింగ్ ఏఈ తులసీరామ్, ఏవో శాంత్ కుమార్, ఆలయ పూజారి జోషి వాదిరాజ్ , ఆలయ కమిటీ సభ్యులు పి. అరవింద్ రెడ్డి, రాజకోటి మల్లయ్య, బి. వెంకట్ రెడ్డి, తదితర స్థానిక ప్రముఖులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఓటర్ నమోదు సర్వర్ డౌన్

**వెంటనే పునరుద్ధరించాలి : ఆర్డీఓకు బీజేపీ వినతి**

**తాండూరు నవంబర్ 3(జనంసాక్షి) :** గత రెండు రోజులుగా ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ నమోదు ఆన్ లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో పట్టభద్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సర్వర్ ను పునరుద్ధరించాలని పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో తాండూరు రెవెన్యూ డివిజన్ అధికారికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ ఎన్ రోల్మెంట్ ఆన్ లైన్ పనిచేయడం లేదు. సర్వర్ లేనందున పట్టభద్రుల ఓటు నమోదు చేయలేకపోతున్నారు. ఆసక్తి గల పట్టభద్రులు అందరూ నిరాశకు గురవుతున్నారు. కావున వెంటనే ఆన్ లైన్ ఓటర్ ఎన్ రోల్మెంట్ ను పునరుద్ధరించాలి" అని డిమాండ్ చేశారు."అదే విధంగా తాండూరులో పట్టభద్రుల ఓటర్ నమోదు క్యాంపు నిర్వహించి త్వరితగతిన ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై, ముఖ్యంగా ప్రభుత్వంపై ఉంది. ఏ ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూసే బాధ్యత ఉంది. కాబట్టి క్యాంపు నిర్వహించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని బీజేపీ పార్టీ తరపున కోరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో, 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు ఛిదిరి ప్రకాష్, దోమ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మందటి రాజు, సతీష్, చందు, బుచ్చప్ప, వడ్డే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## లా మెంటారా కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య

తీసుకుంటున్నాడు. సాయంత్రం వరకు తోటి విద్యార్థులతో సాధారణంగానే గడిపిన మోక్షజ్ఞ, రాత్రి స్టడీ అవర్ సమయంలో హాస్టల్ గదిలోనే బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. స్టడీ అవర్ ముగిసిన తర్వాత విద్యార్థులు గదికి వెళ్లగా, ఎంత తట్టినా తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి లోపలికి చూశారు. మోక్షజ్ఞ వేలాడుతూ కనిపించడంతో వెంటనే వార్డెన్‌కు సమాచారం అందించారు. అయితే, సమయానికి స్పందించి విద్యార్థిని కాపాడాల్సింది పోయి వార్డెన్, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వీడియోలు తీశారని తోటి విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కళాశాలపై దాడి.. అర్ధరాత్రి రణరంగం**

సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నించారు. అయితే, విద్యార్థి మృతికి యాజమాన్యమే కారణమంటూ విద్యార్థులు మృతదేహాన్ని అడ్డుకున్నారు. పోలీసులు వారిని పక్కకు తోసివేసి అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తోటి విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలపై దాడికి దిగారు. కిటికీ అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఘటన సమయంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన కళాశాల ఫ్యాకల్టీ ఒకరు మూర్ఛపోయి కిందపడిపోయారు. కాగా , ప్రిన్సిపాల్ మరో కారులో ఘటన స్థలం నుంచి నిష్క్రమించేందుకు ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. ప్రిన్సిపల్ ను కారులో నుంచి బయటకు లాగే ప్రయత్నం చేశారు. విద్యార్థులు దాడికి యత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. తన కారు డ్రైవర్ చాకచక్యంగా విద్యార్థుల దాడి నుంచి తప్పించగలిగారు.

## దత్తాత్రేయ నగర్ కాలనీలో డ్రైనేజీ అభివృద్ధి పనులకు శ్రీకారం

**రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించినకళ్లెం నవజీవన్ రెడ్డి**

**హయత్ నగర్, నవంబర్ 3 (జనం సాక్షి) :** లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ నగర్ కాలనీ అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.30 లక్షల నిధులను తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మంజూరు చేయించారని దత్తాత్రేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది యాదగిరి యాదవ్ తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం కాలనీలో డ్రైనేజీ పైపులను దించే కార్యక్రమం ప్రారంభమైనట్లు ఆయన వెల్లడించారు. కాలనీలో చాలాకాలంగా ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి, మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ఈ పనుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పూర్తయితే కాలనీవాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, మురుగునీటి సమస్యలు తగ్గడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రజల అవసరాలను గుర్తించి డ్రైనేజీ అభివృద్ధి కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించడంలో చొరవ తీసుకున్న తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి కాలనీ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మద్ది యాదగిరి యాదవ్ మాట్లాడుతూ, దత్తాత్రేయ నగర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కళ్లెం నవజీవన్ రెడ్డి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చూపుతున్న చొరవ, కాలనీ అభివృద్ధిపై కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కాలనీ అభివృద్ధికి సహకరిస్తూ, మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దత్తాత్రేయ నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించి, డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేసిన కళ్లెం నవజీవన్ రెడ్డికి కాలనీ ప్రజల తరఫున మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మద్ది యాదగిరి యాదవ్ తెలిపారు.

# మైనింగ్ గుంతలో మృత్యుఘోష

**- ఇకనైనా అధికారులు మేల్కొనాలి.**

తరిగోపుల ఘటనతోనైనా సంబంధిత అధికారులు మేల్కొని మండలంలోని అన్ని మైనింగ్ ప్రాంతాలను తనిఖీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న గుంతలను గుర్తించి తక్షణమే రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రెండు నిండు ప్రాణాలు కోల్పోయిన తర్వాత స్పందించడం కాదు.మరో కుటుంబంలో ఇలాంటి విషాదం చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే అధికారుల బాధ్యత.అని ప్రజలు అంటున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**రూ.20 లక్షల పరిహారం అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలి**

ఈ ఘటనపై సీపీఎం ధారూర్ మండల కార్యదర్శి మద్దులపల్లి సుదర్శన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ గుంతల్లో పడి ఇద్దరు యువకులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న వ్యక్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశా రు. మైనింగ్ తవ్వకాలు చేపట్టిన అనంతరం భారీ గుంతలను పూడ్చకుండా వదిలేయడం యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిదర్శనమని సుదర్శన్ విమర్శించారు. ఇలాంటి ప్రమాదకర గుంతల కారణంగా ప్రజలు, పశువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి బాధ్యులైన మైనింగ్ యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



అదేవిధంగా మండలంలోని అన్ని మైనింగ్ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న గుంతలను తక్షణమే పూడ్చివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సుదర్శన్ విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి





## రాజలింగం కాలనీ, మహాలక్ష్మి నగర్ కాలనీలలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- **సుమారు 90 లక్షల నిధులతో ప్రధాన లింకు రోడ్ల అభివృద్ధి**
- **ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మేయర్ అజయ్ యాదవ్, పోగుల నరసింహారెడ్డి, కొత్త కిషోర్ గౌడ్**

**బోడుప్పల్–జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా రాజలింగం కాలనీ ఫేస్-2, శ్రీ మహాలక్ష్మీనగర్ కాలనీ, ఎస్ ఫై నగర్ కాలనీలను కలిపే ప్రధాన లింకు రోడ్లలో నూతన సిసి రోడ్డు పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, మాజీ కార్పోరేటర్లు కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బింగి జంగయ్య యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ అక్బర్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిలీప్ రెడ్డి , డివిజన్ జనరల్ సెక్రెటరీ పడతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ మాట్లాడుతూ శ్రీ మహాలక్ష్మి కాలనీ, రాజలింగం కాలనీ ఫేస్-2, ఎస్ఫై నగర్ కాలనీలను కలిపి ప్రధాన రోడ్లను సుమారు 90 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని, త్వరగా పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న మాజీ మేయర్ అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజలింగం కాలనీ ఫేజ్ - 2 అధ్యక్షులు రూపాని రామకృష్ణ, జనరల్ సెక్రటరీ విఠల్ , వైస్ ప్రెసిడెంట్లు విష్ణుమూర్తి, యాదగిరి, సుశ్రీత్, కోశాధికారి వేణు, నరసింహారెడ్డి, శ్రీ మహాలక్ష్మి నగర్ కాలనీ అధ్యక్షులు రూపాని విష్ణు, జనరల్ సెక్రెటరీ ప్రదీష్, వైస్ ప్రెసిడెంట్ వరకుప్పల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, కోశాధికారి సుదర్శన్ రావు, పలకాలనీలా అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : సర్పంచ్ విజయ పవన్ యాదవ్**

**దోమ నవంబర్ 03 జనం సాక్షి :**

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని బొంపల్లి సర్పంచ్ విజయ పవన్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు గుడిసె రాములుతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని అన్నారు.



స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోసిన్ పాష, గ్రామపంచాయతీ కార్యదర్శి మీనా, డీలర్ నరేందర్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముబేర్, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించండి

**అధికారులకు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి**

**తాండూరు నవంబర్ 3(జనంసాక్షి) :** సమస్యలతో వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూలంగా స్పందించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాండూరు పట్టణంలో వివిధ శాఖల అధికారులను ఆర్బిఓఎల్ సీఈఓ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బీ శాఖ, తాండూరు డీఎస్పీ, జిల్లా మాతా శిశు ఆసుపత్రి, పురపాలక శాఖ అధికారులు ప్రజలు తమ సమస్యలతో వచ్చినప్పుడు సానుకూలంగా స్పందించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి" అని సూచించారు.అలాగే మాతా శిశు కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, రోగులు వారి బంధువులతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, చికిత్సలు అందించాలని" సిబ్బందికి సూచించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, వివిధ శాఖల ఆదికారులు తదితరులు ఉన్నారు.

## బొంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలు

**దోమ మండల ఎంపీడీఓ కు వినతి పత్రం అందజేత**



**దోమ నవంబర్ 03 జనం సాక్షి :** బొంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలు - అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని దోమ మండల ఎంపీడీఓ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. బొంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులైన నిరుపేదలకు ఇండ్లను కేటాయించకుండా గ్రామంలోని కొందరు గల్లీ లీడర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు, మరికొందరు కార్యకర్తల వద్ద నుండి కమీషన్లు తీసుకుని వారికి అనుకూలంగా ఉన్నవారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తున్నారని, దాదాపు నివాసయోగ్యమైన ఇండ్లను కూల్చి మళ్లీ ఇండ్లు కట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.నిజంగా ఇండ్లు లేని నిరుపేదలను పట్టించుకోకుండా గ్రామంలోని గల్లీ లీడర్లు, సర్పంచ్, అలాగే పంచాయతీ సెక్రటరీ, కొంతమందితో కుమ్మక్కై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని ఇండ్లను తమ వారికి కేటాయిస్తున్నారని, దీంతో నిజమైన నిరుపేదలకు దక్కాల్సిన ఇండ్లు దక్కకుండా పోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దోమ మండల అధ్యక్షుడు బొంపల్లి వెంకటేష్ ఎమ్మార్పీఎస్ మండల జనరల్ సెక్రెటరీ యు. యాదయ్య, దోమ మండల మాల మహానాడు ఉపాధ్యక్షులు కావాలి ప్రభాకర్ , యాదయ్య పాల్గొన్నారు

## పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి: వరికుప్పల సుధాకర్



**యాచారం, నవంబర్ 3(జనంసాక్షి) :** ఉమ్మడి మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ జిల్లాల పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని టిపిసిసి స్టేట్ ఓబీసీ అబ్జర్వర్ వరికుప్పల సుధాకర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, విద్యావంతుల గొంతుక శాసనమండలిలో వినపడాలంటే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆయన పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఓటర్ ఐడీ పత్రాలతో ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు ఉన్నవారు సైతం ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. దరఖాస్తుకు నవంబర్ 6, 2026 ఆఖరు తేదీ అని, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడు దివ్యాంగుల బస్ పాస్ మేళా

**డిపో మేనేజర్ పరిటాల ప్రవీణ్ కుమార్**



తాండూరు నవంబర్ 3(జనంసాక్షి) ,తాండూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ లో బుధవారం దివ్యాంగుల బస్ పాస్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు,వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ తెలిపారు.ఈ బస్ పాస్ క్యాంపుకు, పెద్దేముల్, యాలాల, తాండూర్, బషీరాబాద్ మండలాల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.ఈ బస్ పాస్ మేళాకు వచ్చేటప్పుడు, సదరం సర్టిఫికెట్ జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, పాస్ ఫోటో, బస్ పాస్ రుసుం 50 రూపాయలు తీసుకొని ఉదయం 11 గంటలకు, తాండూర్ బస్‌స్టాండ్‌కు రాగలరు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూర్ డిపో మేనేజర్ పరిటాల ప్రవీణ్ కుమార్, హాజరవుతారు. మిగతా వివరాలకు, 9182190549 నెంబర్ ను సంప్రదించగలరు.

## నేడు జరిగే మేధావుల సమావేశాన్ని విజయవంతం చేయండి

**బిజెపి మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి**



**మర్పల్లి నవంబర్ 03 (జనంసాక్షి)** ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ భద్రత, ఆర్థిక పారదర్శకత అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో నేడు వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన మేధావులు, విద్యావేత్తలు, వివిధ రకాల నిపుణులతో నిర్వహిస్తున్న మేధావుల సరస్సును విజయవంతం చేయాలని మర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం (నేడు) వికారాబాద్ లోని శివకేశవ బ్రాకెట్ హాల్లో నిర్వహిస్తున్న మేధావుల సరస్సు కార్యక్రమానికి మేధావులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొంటున్నారని మంగళవారం ఆయన తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

**అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలి: విష్ణువర్ధన్ రెడ్డి**



**జూబ్లీహిల్స్, జనం సాక్షి:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ఉదయం కృష్ణకాంత్ పార్కులో మార్నింగ్ వాక్‌కు వచ్చిన ప్రజలను కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లు తమ విలువైన ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదులో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంగల్‌రావు నగర్ తాజా మాజీ కార్పొరేటర్ దేదీప్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొంత నిధులతో బోరు వేయించి గ్రామస్తుల నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్

**చేవెళ్ల, నవంబర్ 03 (జనంసాక్షి)**



చేవెళ్ల మండలం నాంచేరి గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టాపురంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ పులుమామిడి అశోక్ చొరవ చూపారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించి తన సొంత నిధులతో బోరు వేయించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్యకు ఉపశమనం కలగనుంది. గ్రామస్తుల అవసరాన్ని గుర్తించి సొంత ఖర్చులతో బోరు వేయించిన సర్పంచ్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పూర్ణచంద్ర, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐదేళ్లుగా అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదాన సేవ

- రోజుకు 800 నుంచి 900 మంది స్వాములకు అన్నప్రసాదం, అల్పాహారం
- భక్తితో పాటు సేవాభావానికి ప్రతీకగా ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి సేవలు



**రాజేంద్రనగర్, నవంబర్ 3 (జనంసాక్షి):**
అయ్యప్ప దీక్షలో భక్తితో పాటు సేవాభావానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఆకలితో వచ్చే స్వాములకు అన్నదానం చేయడం భగవంతుడికి చేసే సేవతో సమానమని ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి చాటిచెబుతున్నారు. గత ఐదేళ్లుగా వేలాది మంది అయ్యప్ప స్వాములకు నిరంతరాయంగా అన్నదాన సేవ చేస్తూ భక్తి, మానవత్వం, సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి డిసెంబర్ 11, 2026 వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్ నగర్, అల్కాపూర్ రోడ్ నంబర్ 13 పార్కు వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ సుమారు 800 నుంచి 900 మంది అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

అయ్యప్ప దీక్షలో నియమ నిష్ఠలతో పాటు తోటి భక్తులకు సేవ చేయడం కూడా ముఖ్యమనే భావనతో సురేష్ స్వామి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అన్నదానం కేవలం ఆకలి తీర్చడమే కాకుండా భక్తుల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తుందని ఆయన సేవ ద్వారా చాటుతున్నారు. ఐదేళ్లుగా వేలాది మంది స్వాములకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా సురేష్ స్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చే సేవ అని తెలిపారు. స్వాములందరూ ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భిక్ష స్వీకరించి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని ఆహ్వానించారు. భక్తితో చేసే సేవలో లభించే ఆత్మసంతృప్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు.



## హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీసీ యువ నాయకుడు కుమ్మరి ఆకాష్

### తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిగా ప్రకటన

**తాండూరు నవంబర్ 3(జనంసాక్షి) :** హైదరాబాద్-మహబూబ్ నగర్-రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో బీసీ యువ నాయకుడు కుమ్మరి ఆకాష్‌ను అభ్యర్థిగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధిష్టానం ప్రకటించింది. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడంతో పాటు బీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా తాండూరు పట్టణంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ తాండూరు ఇన్‌చార్జి బుస్సా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు కుమ్మరి ఆకాష్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం అభినందనీయం. విద్యావంతులైన పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు యువ నాయకత్వం ముందుకు రావడం మంచి పరిణామం" అని పేర్కొన్నారు. కుమ్మరి ఆకాష్ అభ్యర్థిత్వానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాలు, యువత సంపూర్ణ మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ వీరమణి, కోళ్ల శ్రీనివాస్, కళావతి, యాదయ్య, లావణ్య, ఇందిర, వినోద, స్వప్నతో పాటు తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీకి పోతుగంటి మహేష్ రాజీనామా

### 15 రోజుల్లో భవిష్యత్ రాజకీయ కార్యాచరణ వెల్లడిస్తానన్న మహేష్



**తలకొండపల్లి నవంబర్ 03 (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగంటి మహేష్ భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పార్టీ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు నవంబర్ 3న బీజేపీ రాష్ట్ర,జిల్లా అధ్యక్షులకు రాజీనామా లేఖ పంపించారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి,పదవులకు రాజీనా మా చేస్తున్నట్లు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా పోతుగంటి మహేష్ మాట్లాడుతూ..గత 20 సంవత్సరాలుగా బీజేపీలో చురుకుగా కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతా నికి నిరంతరం కృషి చేశానని తెలిపారు. బీజేపీ పార్టీలో దళితులకు సరైన గుర్తింపు లేదని,దళిత నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తలకొండపల్లి మండల అభివృద్ధి కోసం,ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశానని చెప్పారు. ఈ క్రమంలో తనపై పలు కేసులు నమోదైనా వెనకడుగు వేయకుండా పార్టీ కోసం పనిచేశానని పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన బీజేపీ నూతన మండల కమిటీలో ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వాలని కోరినప్పటికీ తనకు అవకాశం కల్పించలేదని,కొందరు మండల నాయకుల వ్యవహార తీరు కారణంగానే తాను పార్టీని వీడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తనకు పార్టీలో అవకాశం కల్పించిన నాయకత్వానికి, తనతో కలిసి పనిచేసిన నాయకులు,కార్యకర్తలకు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించి పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించాలని రాజీనామా లేఖలో కోరినట్లు వెల్లడించారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరబోతున్నాననే విషయాన్ని మరో 15 రోజుల్లో వెల్లడిస్తానని పోతుగంటి మహేష్ స్పష్టం చేశారు. మండలంలో యువ నాయకుడిగా మంచి పట్టు ఉన్న మహేష్ బయటకు వెళ్లడంతో స్థానిక బీజేపీకి గట్టి దెబ్బ తగిలినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## చేవెళ్ల బస్సు ప్రమాద మృతులకు బిఎస్ఆర్ ఘన నివాళి

### తాండూరులో కొవ్వొత్తుల ర్యాలీ.

తాండూరు నవంబర్ 3(జనంసాక్షి)చేవెళ్ల బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల జ్ఞాపకార్థం తాండూరులో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆర్బిఓఎల్ సీఈఓ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమాద మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఈ ర్యాలీలో పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, ఆర్ట్ ఆఫ్ లవింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొని మృతులకు ఘనంగా నివాళులర్పించారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రేఖం యాదయ్యకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**కొడంగల్, నవంబర్ 3 (జనం సాక్షి):** హకీంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రేఖం యాదయ్య అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా యాదయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో పాటు దుద్యాల మండల బీఆర్ఎస్ యువజన నాయకులు లగచర్ల సురేష్ పాల్గొన్నారు.

# పందెం వాగుకు ముప్పు నిర్మాణాల మాటున నాలా కబ్జా ఆరోపణలు

- సామాన్యుల నిర్మాణాలకేనా హైడ్రా కూల్చివేతలు... బడా బాబుల ఆక్రమణలు కనిపించవా?

**రాజేంద్రనగర్,నవంబర్3(జనంసాక్షి) :** నార్సింగ్ సర్కిల్ పరిధిలోని పుప్పాలగూడ లోని సర్వే నంబర్లు 128పి,129పి,130 పి,145,145పి, 147,148పి,149 పి ఆనంద హోమ్స్ లెగసి నిర్మాణ సంస్థలో భాగంగా స్వలాభం కోసం పందెం వాగు నాలా ఆక్రమణలకు గురవుతూ క్రమంగా కుంచించుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలా పరిరక్షణ బాధ్యత కలిగిన హైడ్రా అధికారులు సైతం ఈ వ్యవహారంపై మౌనం వహించడంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సామాన్యుల ఇళ్ల కూల్చివేతలకే పరిమితమా? బడా నిర్మాణ సంస్థల ఆక్రమణలపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీస్తున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం సుమారు 100 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా ప్రస్తుతం మట్టి పోసి పూడ్చివేయడంతో దాదాపు 30 మీటర్లకు కుదించుకుపోయిందని ఆరోపిస్తున్నారు. నాలా విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, భారీ వర్షాల సమయంలో మణికొండలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలా పరిసరాల్లో బఫర్ జోన్ ఆక్రమణలు, ప్రహరీ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలను పరిరక్షించాల్సిన హైడ్రా బడా నిర్మాణ సంస్థల విషయంలోనూ సమానంగా వ్యవహరించాలని



డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి నాలా అసలు విస్తీర్ణాన్ని నిర్ధారించాలని, ఆక్రమణలు నిజమని తేలితే వాటిని తొలగించి పందెం వాగు ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారిణికి వివరణ కోరగా గతంలో ఎంత వెడల్పు ఉండేదో ప్రస్తుతం ఎంత ఉందో మీరే కొలుచుకోమణి చెప్పడం బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులదా? లేక నాలా వెడల్పును కొలిచి అధికారులకు వివరించాల్సిన బాధ్యత ప్రజలదా? పందెం వాగు నాలా వెడల్పుపై ప్రశ్నిస్తే మీరే కొలుచుకోండంటూ సమాధానం చెప్పడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఉండాల్సిన వివరాలు ప్రజలకు తెలియకపోతే, ఇక నాలాల పరిరక్షణ ఎలా సాధ్యమవుతుంది? ఆక్రమణలను గుర్తించి తొలగించాల్సిన అధికారులే ఇలా స్పందిస్తే ప్రజల సమస్యలకు దిక్కెవరు? ఇప్పటికైనా అధికారులు బాధ్యతగా వ్యవహరించి పందెం వాగు అసలు విస్తీర్ణాన్ని వెల్లడించి, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి. నాలా కుంచించుకుపోవడానికి అప్పటి మున్సిపల్ అధికారులు నిర్మించిన ప్రహరీ గోడలే కారణమని చెప్పడం అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టం చేస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. నాలా కబ్జాలు, బఫర్ జోన్ ఆక్రమణలపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హెచ్ఆర్డీసీఎల్, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమస్య పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే నాలా కుంచించుకుపోవడంతో మణికొండలో ముంపు సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీఎంసీ కమిషనర్ సృజనతో పాటు హెచ్ఆర్డీసీఎల్, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని, పందెం వాగు నాలాపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి, అసలు వెడల్పును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే భవిష్యత్తులో ముంపు సమస్యలకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

# విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలి

- మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి
- చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 03 (జనంసాక్షి) :**
విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు, వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని విద్యాశాఖ చాంబర్లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటు సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతోపాటు, వారి ప్రతిభను ప్రదర్శించేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి : ఎం.శ్రీనివాస్**
విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతోపాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ, ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, పరిశీలనా శక్తిని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈ టాలెంట్ టెస్టులను నవంబర్ 12న పాఠశాల స్థాయిలో, నవంబర్ 21న మండల స్థాయిలో, నవంబర్ 28న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డిసెంబర్ 11, 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిభను చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎడి, జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, కోశాధికారి జెన్నీ, కీసర మండలం ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ హెడ్ మాస్టర్ శేషగిరిరావు, సీనియర్ రిపోర్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు



# పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

**మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహా ముదిరాజ్**

**తలకొండపల్లి నవంబర్ 03 (జనంసాక్షి):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ పద్మ నరసింహా ముదిరాజ్ కోరారు.వెల్జాల్,గట్టు ఇప్పలపల్లి,చౌదర్ పల్లి గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పట్టభద్రుల ఓటర్ నమోదును పరిశీలించారు.ఓటు హక్కు పొందేందుకు అర్హత ఉన్న పట్టభద్రులు ఓటర్ గా నమోదు చేసుకోవాలని తెలిపారు.పట్టభద్రుల ఓటు నమోదు చేయడంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలన్నారు.గడువు ముగిసేలోపు అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు తమ పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని పద్మ నరసింహా కోరారు.పట్టభద్రుల ఓటు నమోదుకు అవసరమైన డిగ్రీ సర్టిఫికెట్,ఆధార్ కార్డు,ఫోటో వంటి పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి పట్టభద్రుల ఓట్ల నమోదు కీలకమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ సర్పంచ్ జోతయ్య,వెల్జాల్ సర్పంచ్ వానరాసి రాములమ్మ తనయుడు వెంకటేష్,ఉపసర్పంచ్ విజయలక్ష్మి విజయ్ కుమార్,జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యుడు ముజ్జుబుర్ రెహమాన్,వార్డు సభ్యులు శేఖర్ యాదవ్,ఎన్నికల పరిశీలకుడు బి.చందు,పి.రాజు,రాజుగౌడ్ పాల్గొన్నారు.

# ఎండిన వరి,మొక్కజొన్న పంటలను పరిశీలించిన అధికారులు

**పంట నష్టంపై సమగ్ర నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందిస్తాం : ఏడిఏ శోభారాణి**

**తలకొండపల్లి నవంబర్ 03 (జనంసాక్షి):**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన పంట పొలాలను తలకొండపల్లి ఏవో రేణుక చక్రవర్తినితో కలిసి ఆమనగల్ ఏడీఏ శోభారాణి పరిశీలించారు.తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు మొక్కజొన్న,వరి,కంది తదితర పంటలు ఎండిపోయిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఏడీఏ శోభారాణి మాట్లాడుతూ..మండలంలోని వివిధ గ్రామాల్లో ఎండిపోయిన పంటల వివరాలను సేకరించి,పంట నష్టంపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తామని చెప్పారు.ఏఈఓలు ఎండిపోయిన పంట పొలాల వద్దకు వచ్చినప్పుడు రైతులు అక్కడే ఉండి పంటలను చూపించి,వాటి నమోదుకు సహకరించాలని ఏడీఏ కోరారు.ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు ఆమె భరోసా ఇచ్చారు.రైతులు అధైర్యపడవద్దని,ప్రభుత్వం అండగా ఉంటుందని శోభారాణి తెలిపారు.గ్రామాల్లో సర్పంచులు,అధికారులు దండోరా వేయించి వ్యవసాయ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు లలిత,సునీత,రైతు కటికల పాండు,రైతులు,వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన

**ఎల్‌నినో ప్రభావాలపై జిల్లావ్యాప్తంగా కళాజాత కార్యక్రమాలు**



**హైదరాబాద్ సిటీ, నవంబర్ 03 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు నీరు, విద్యుత్ పొదుపు వినియోగంపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి(డీపీఆర్ఓ) హబీబ్ మొహమ్మద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశాల మేరకు సైదాబాద్ మండలంలోని చంచల్‌గూడ జైలు సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో, అమీర్‌పేట మండలంలోని ధరంకరణ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. రాబోయే ఎనిమిది నెలల పాటు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరంపై కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీరు, విద్యుత్ ఆదా చేసే విధానాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని డీపీఆర్ఓ హబీబ్ మొహమ్మద్ వెల్లడించారు.

# తలకొండపల్లి బీజేపీ మోర్చా కమిటీల ఎన్నిక

**తలకొండపల్లి నవంబర్ 03 (జనంసాక్షి):**
తలకొండపల్లి మండల బీజేపీ నూతన మోర్చా కమిటీలకు అధ్యక్షులను నియమించారు.జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సూచన మేరకు నియమితులైన వారికి మండల బీజేపీ అధ్యక్షుడు నీలకంఠం పాండు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోర్చా నాయకులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ,వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.పార్టీ సిద్ధాంతాలు,ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ,రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా ఎదిరె వెంకటేష్, యువ మోర్చా అధ్యక్షుడిగా ఈసారి బాలకృష్ణ,దళిత మోర్చా అధ్యక్షుడిగా ఎట్టి రాజు,గిరిజన మోర్చా అధ్యక్షుడిగా జర్పుల సురేష్ నాయక్,ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పసునూరి హరికాంత్,మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ముత్యాల సంతోష,మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా ఎండి రహీంపాష నియమితులయ్యారు.పలువూరు బీజేపీ నాయకులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా ఎన్నికైన మోర్చా అధ్యక్షులకు మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ కార్యకర్తలు,నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.త్వరలోనే మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మండల అధ్యక్షుడు పాండు తెలిపారు.పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు.



# ఎల్లమ్మ దేవాలయాన్ని నూతనంగా ఆధునిక హంగులతో నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ

- ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా బోనాల ఉత్సవం
- పోతరాజుల విన్యాసాలతో భక్తుల సందడి



**మొయినాబాద్ మున్సిపాలిటీ 03 నవంబర్ (జనం సాక్షి)** చిలుకూరు గ్రామ శివారులోని ఇంద్రారెడ్డి కాలనీ సమీపంలో పురాతనంగా పూజలందుకుంటున్న ఎల్లమ్మ దేవాలయాన్ని నూతనంగా ఆధునిక హంగులతో నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిలుకూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ గున్నాల గోపాల్ రెడ్డి, నాళం కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయాన్ని ఆధునికరించగా, గత నాలుగు రోజులుగా వేద పండితుల సమక్షంలో ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం గ్రామస్తులంతా చిన్నాపెద్దా తేడా లేకుండా ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# బస్వాపూర్ ఆయిల్పామ్ సాగుపై రైతులకు అవగాహన

**బంట్వారం నవంబర్ 03 జనం సాక్షి :**
బంట్వారం మండలం బస్వాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ ప్రవంతి శివరాజ్, ఉపసర్పంచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆయిల్పామ్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్పామ్ సాగు విధానం, డ్రిప్ పద్ధతిలో నీటి వినియోగం, పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎకో ఫామ్ కంపెనీ ప్రతినిధులు రాము, రవితేజ, ఉద్యానవన విస్తరణ అధికారి రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

